# నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శనివారం 3 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


## పింఛన్ కోసం పడిగాపులు..!



కార్యాలయం వద్ద వేచి ఉన్న చెన్నమ్మ

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 2 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కొత్త పింఛన్ రూ.4వేలు వస్తాయని ఆశించిన అవ్వకు కొత్త ప్రభుత్వం ఉన్న ఆసరాకు ఎసరు పెట్టింది. కొల్లాపూర్ మండలం ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన మంచాల కురుమయ్య భార్య మంచా ల చెన్నమ్మ ఆసరా పింఛన్‌కు అర్హత ఉన్నా అరువు తెచ్చుకొని బతుకుతున్నది. కుటుంబానికి ఆసరా ఉన్న మంచాల కురుమయ్య చనిపోవడంతో మంచాల చెన్నమ్మ ఒంటరి పక్షి అయ్యింది. భర్త కు వస్తున్న పింఛన్ మాయమైంది. తనకు రావాల్సిన పింఛన్ దారిలో సాకులు వెతుకుతోంది. దీంతో అనారోగ్యం బారి న పడిన మంచాల చెన్నమ్మ ఎన్మన్‌బెట్ల నుంచి రోజూ కొల్లాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి పడిగాపులు కాస్తోంది. కాంగ్రెస్ గెలిచిన వెంటనే కొత్త పింఛన్ ఇస్తామన్నారు.. నాకు కొత్త పింఛన్ ఎప్పుడిస్తారు చెప్పండని అధికారులు, కార్యాలయానికి వచ్చే వారితో మొరపెట్టుకుంటున్నది. కాగా శుక్రవారం కూడా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన చెన్నమ్మ కార్యాలయఆ వరణలోనేపడి గాపులు కాసి సొమ్మసిల్లి పడిపోయింది.




సమావేశంలో మాట్లాడుతున్న మర్రి జనార్దన్‌రెడ్డి

## కేసీఆర్ అంటే ప్రజలకు అభిమానం

- గులాబీ బాస్‌ను గుండెల్లో పెట్టుకొన్నారు
- ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందాలి
- కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా
- మాజీ ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 2 : ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి ఉందని, ఇదే పరిస్థితులను పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు సానుకూలంగా మలచుకోవాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలకపల్లి, నాగర్‌కర్నూల్ రూరల్‌కు సంబంధించిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులని, వారి వల్లే ఇన్నేండ్లుగా పార్టీ బలంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు ఎన్నో ఉన్నాయని కేవలం 5వేల ఓట్లతో దాదాపు 20మంది ఎమ్మెల్యేలు ఓడిపోవడం జరిగిందన్నారు. రాష్ట్రం మొత్తం కేవలం 1.5 శాతం నుంచి 2 శాతం ఓట్లతో అధికారం కోల్పోయామన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురైందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాగర్‌కర్నూల్, దేవరకద్ర మాత్రమే బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందని బాగా మాట్లాడారని, సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారాన్ని మనం గట్టిగా తిప్పికొట్ట లేకపోయామన్నారు. ప్రతిపక్షం వారు అభూత కల్పనలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ వాళ్లు కూడా కలగనలేదన్నారు. అందువల్లే ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండేది కొంతకాలమేనని, భవిష్యత్తు కోసం బీఆర్‌ఎస్ కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని, మళ్లీ మన సత్తా ఏంటో చూపించాలన్నారు. బూత్‌కి ఐదుగురి కథానాయకులు కావాలని, పంచ పాండవుల లాగా పని చేయాలన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని పటిష్టంగా తయారు చేస్తామన్నారు. తానే స్వయంగా గ్రామాలకు వస్తానని, సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామ పార్టీ కమిటీలను పునర్ నిర్మాణం చేస్తామన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ప్రతిపక్షాలు తమ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేవిధంగా ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నేతలు బైకని శ్రీనివాస్‌యాదవ్, నాగం శశిధర్‌రెడ్డి, హన్మంతురావు, నరేందర్‌రెడ్డి, బంగారయ్య పాల్గొన్నారు.



మక్తల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, వేదికపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజిని సాయిచంద్, మల్లప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి

- ఎన్నికల్లో అసత్య ప్రచారంతో అధికారంలోకి..
- విదేశాల్లో తెలంగాణ పరువు తీసిన రేవంత్
- గులాబీ క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుతాం
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

## గాలిమేడల్లా

# కాంగ్రెస్ హామీలు

- నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడడంతోనే ఓడిపోయాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మక్తల్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం
- హాజరైన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు



మక్తల్ టౌన్/ఊట్కూరు, ఫిబ్రవరి 2 : 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆకాశంలో గాలి మేడలు చూపించి, అమలు కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని రవి కన్వెన్షన్ హాల్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించగా ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లు కేసీఆర్ ఉద్యమాలు చేసి రాష్ర్టాన్ని సాధించి అగమైన తెలంగాణను పునర్నిర్మాణం చేస్తే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంబడే దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశాల్లో తెలంగాణ పరువు తీశారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని తట్టుకోలేక దావోస్‌లో 100 అడుగుల లోతులోకి తొక్కుతానంటూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. త్వరలోనే రేవంత్‌రెడ్డిని బొంద పెట్టేందుకు తమ పార్టీకి చెందిన నాయకులు సిద్ధమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో 17ఎంపీ స్థానాలు గెలిస్తేనే హామీలు అమలుకు ఆస్కారం ఉందంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడడం రాష్ట్ర ప్రజలను మోసం చేసినట్టే అన్నారు. ఎన్నికల సమయంలో పార్లమెంట్ ఎన్నికల్లో గెలిస్తేనే హామీల అమలు చేస్తామని ప్రజలకు చెప్పి హామీలను ప్రకటించారా అని ప్రశ్నించాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ పార్టీదేనని పేర్కొన్నారు. దొంగల ముఠా లాగ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలను మోసం చేసి 420 హామీలను ప్రజలకు చూపించి అధికారంలోకి వచ్చారన్నారు. అమలుకాని హామీలను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ఎక్కడ పోయిందని డిసెంబర్ 9 పోయి ఫిబ్రవరి 9 వస్తుందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజలకు దొంగ హామీలు ఇవ్వడంతోపాటు ప్రజలను ఇబ్బందుల పాలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. యాసంగిలో కేసీఆర్ రైతన్నలకు రైతుబంధు వేయడానికి రూ.7,000 కోట్లను ట్రెజరీలో పెడితే ఆ డబ్బులు రైతుల ఖాతాల్లోకి జమ కాకుండా అడ్డుకున్నది రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతన్నలకు రైతుబంధు జమ చేయకుండా తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు కమీషన్ల కోసం రూ.5000 కోట్లను వాడుకొని రూ.రెండు వేల కోట్లు మాత్రమే రోజు గుంట చొప్పున రైతన్నలకు రైతుబంధు ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హామీల్లో ప్రతి మహిళాకు మహాలక్ష్మి పథకం నుంచి నెలకు రూ.2500 ఇస్తామన్నారని, రాష్ట్రంలో కోటీ 28 లక్షల మంది మహిళలు ఉన్నారని వారికి ఒక్కొక్కరికి రూ.2500 చెల్లిస్తే ఎన్నికోట్లు అవుతుందో, వాటిని ఎక్కడ నుంచి తీసుకువస్తారో సీఎం రేవంత్‌రెడ్డి లెక్కలు చెప్పాలన్నారు. ఇచ్చిన హామీలు మభ్యపెట్టేందుకే రేవంత్‌రెడ్డి కేసీఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి వారి మెడలు వంచుదామని సత్యవతి రాథోడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు పార్లమెంట్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన ఎవరినైనా విషయాన్ని అధినేత కేసీఆర్‌తో చర్చించి ప్రకటించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషి చేయాలని కోరారు.

### సమన్వయలోపంతోనే ఓటమి: శ్రీనివాస్‌గౌడ్

కార్యకర్తలు, నాయకుల సమన్వయ లోపం వల్లనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సిన పరిస్థితి తలెత్తిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కార్యకర్తలను పట్టించుకోకుండా వారి క్షేమాలను అడగకపోవడంతో కార్యకర్తలు, నాయకులకు సమన్వయం కొరవడిందన్నారు. మితిమీరిన పథకాలతో సంక్షేమంలో ముందుకు దూసుకెళ్దామని అనుకున్న తరుణంలో లబ్ధిదారులకు సరైన న్యాయం జరుగక బాధపడుతున్న వారిని పట్టించుకోకపోవడంతో వారి బాధలు చెప్పుకోలేక నాయకులు సైతం వారిని అడగకపోవడంతోనే పెద్దనష్టం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఓటరు లిస్టులు పట్టుకొని బీఆర్‌ఎస్ వాళ్లు తిరుగుతుంటే కాంగ్రెస్ వాళ్లు సంక్షేమ పథకాలు పొందిన వారి లిస్టు పట్టుకొని పొందని వారికి చాడీలు చెప్పడం వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమికి మరో కారణం అన్నారు. జరిగిన దాన్ని వెనక్కి తీసుకురాలేం కాబట్టి త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త నాయకుడికి అందుబాటులో ఉంటే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం తప్పకుండా వరిస్తుందన్నారు. ఇప్పుడిప్పుడే కార్యకర్తలు, నేతలు బాధల నుంచి తేరుకొని ఎంపీ ఎన్నికలకు సిద్ధం అవుతున్నారని, కార్యకర్తలకు ఎలాంటి హాని కలుగకుండా వారిని కంటికి రెప్పలా చూసుకునేందుకు ప్రతి ఒక్క నాయకుడు సిద్ధంగా ఉన్నామని శ్రీనివాస్‌గౌడ్ భరోసా ఇచ్చారు.

### కంకణబద్ధులు కావాలి : చిట్టెం

పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మక్తల్‌ను అన్ని రంగాల్లో అద్భుతంగా తీర్చిదిద్దినప్పటికీ గ్రామ స్థాయిలో నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో ఓ వర్గానికి చెందిన కొద్దిపాటి ఓట్లతో ఎన్నికల్లో తాను ఓడిపోవాల్సి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఓటమికి కార్యకర్తల ఓవర్ కాన్ఫిడెన్స్ మరో కారణంగా పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమి సహజమేనని, అంతమాత్రాన కార్యకర్తలు అధైర్యపడవద్దని సూచించారు. ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిలా భావించి కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబ సభ్యులని, ప్రజల ఆశీస్సులు తమ కుటుంబంపై మెండుగా ఉండటంతో 12 పర్యాయాలు పోటీ చేసి 8సార్లు గెలుపొందామని చెప్పారు. జరిగిన పొరపాట్లను సమీక్షించుకొని వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు కంకణ బద్ధులు కావాలన్నారు. మన పెద్ద నాయకుడు కేసీఆర్ అసెంబ్లీలో అడుగు పెడుతున్నాడని, కాంగ్రెస్ అరాచకాలను కడిగి పారేస్తాడన్నారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కార్యాచరణతో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాటం చేద్దామని కార్యకర్తలను ఉత్తేజం చేశారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

### పథకాలు ఆన్‌లైన్‌లో అందించడంతో నష్టం : ఎంపీ మన్నె

రైతు బంధు, రైతు బీమా, ధరణి పోర్టల్ వంటి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో పార్టీ ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందించడంతో ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు నష్టం జరిగిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బంగారు తెలంగాణ సాధనే ధ్యేయంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బంధు, రైతు బీమా, 24గంటల ఉచిత కరెంటును కేసీఆర్ ప్రభుత్వం అందించిందన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తల ప్రమేయం లేకుండా పథకాలను ప్రజలకు అందించడంతో ఎమ్మెల్యే అభ్యర్థులు గెలువలేక పోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదన్నారు. తెలంగాణ హక్కులు, ప్రాజెక్టులకు జాతీయ హోదా, రైల్వే లైన్‌ల కోసం కొట్లాడిన ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. రాముడు గుడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తుందని, యాదాద్రిని కేసీఆర్ అద్భుతంగా కట్టించినా ఓట్ల కోసం అడగలేదన్నారు. సమావేశం అనంతరం మొత్తం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మాజీ సర్పంచులకు మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, దేవరి మల్లప్ప, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఇంతియాజ్ ఇసాక్, రజినీసాయిచంద్‌తోపా టు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, బీఆర్‌ఎస్ మండలా ల అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పీఏసీసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు, గ్రామ పార్టీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, మాట్లాడుతున్న ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యే చిట్టెం

## ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతాం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 2 : కృష్ణాజలాలను కేంద్రానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతోపాటు తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కుట్రలు చేస్తున్న విషయాన్ని, ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక కృష్ణాజలాల వివాదం సృష్టించిన కాంగ్రెస్ అసమర్థతను ప్రజల్లో ఎండగడుతామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాజలాల వినియోగంలో తెలంగాణకు పెద్దఎత్తున అన్యాయం జరిగిందనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని గుర్తు చేశారు. కరువు ప్రాంతమైన పాలమూరు జిల్లాకు తలాపున కృష్ణానది ప్రవహిస్తున్నా సాగునీరు అందక లక్షలాది ఎకరాల్లో పల్లేర్లు మొలిచాయని చెప్పారు. కరువును పారదోలేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణం చేపడితే ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాలపై హక్కులను కేంద్రానికి కట్టబెడుతుందని ఆరోపించారు. 2021లో కేంద్రం ప్రాజెక్టులను ఆధీనంలోకి తీసుకునేందుకు గెజిట్ జారీ చేసిందని శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను అప్పగించాలని ఒత్తిడి పెంచగా దీనికి కేసీఆర్ ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. రాష్ర్టానికి జరిగిన అన్యాయాన్ని ప్రతిక్షణం గుర్తు చేస్తూ కేంద్రాన్ని కట్టడి చేశారన్నారు. ప్రాజెక్టులను అప్పగిస్తే కీలకమైన విద్యుత్ ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ లెక్కలేనంత నీరు తరలించుకు పోతుంటే ఇక్కడి కృష్ణాబేసిన్‌లో ఉన్న పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలు ఎండిపోతున్నాయన్నారు. గత కాంగ్రెస్ హయాంలోనే పోతిరెడ్డిపాడుకు బొక్కపెట్టారన్నారు. తిరిగి ఇప్పుడు కూడా పాత పద్ధతిని కాంగ్రెస్ అవలంబిస్తుందని దీన్ని ఎండగడుతామన్నారు. ఇప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాకు అతిపెద్ద కష్టం వచ్చిందన్నారు. ప్రస్తుతం ఉన్న జూరాల జలాశయం కింద అతి తక్కువ ఆయకట్టుకు సాగునీరు అందుతుందని చెప్పారు. మరోసారి కృష్ణాజలాలపై హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కృష్ణాజలాల రక్షణ, తెలంగాణ హక్కులకు కేసీఆర్ ఒక్కరే శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- మృతుడి కుటుంబానికి చెక్కుల అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 2 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సంక్షేమమే తమ ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కంచిరావుపల్లి గ్రామానికి చెందిన మృతుడు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కావలి రాజు భార్య సుజాతకు పార్టీ బీమా, రైతు బీమా చెక్కులను మాజీ మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు కావాలి రాజుకు గతంలోనే రైతు బీమా రూ.5 లక్షలు అందించడంతోపాటు పార్టీ బీమా కింద మరో రూ.2 లక్షల చెక్కును కూడా శుక్రవారం అందించామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మొదలు పెట్టిన సంక్షేమ కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనకార్యంగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఫలాలు ప్రజలకు నేడు అందుతున్నాయన్నారు. జిల్లా కేంద్రానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు ఎన్నో చేపట్టామని వాటిలో మరికొన్ని పూర్తి కావాల్సి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వాటిని పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వంలో ఏమో జరిగిందని ఇంకా కల్లబొల్లి మాటలనే చెబుతున్నారే తప్ప తాము ఏం చేస్తామో చెప్పలేక పోతుందన్నారు. ఇక్కడ వాళ్లు చేసేది ఏమీ లేదని విషయం వారికి కూడా తెలుసు కాబట్టే ప్రజలను రెచ్చగొట్టే మాటలతో పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తిరోగమ స్థితిలోకి వెళ్తుందన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పద్మావెంకటేశ్, మీడియా కన్వీనర్ అశోక్, రాంచందర్, ఎల్లారెడ్డి, నాగరాజుగౌడ్, వడ్డె రమేశ్, శరత్ బాబు, భానుయాదవ్, కౌన్సిలర్లు జంపన్న, లక్ష్మీనారాయణ, పుట్టపాకల మహేశ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లు ఎవరూ అధైర్యపడొద్దు



మాజీ ఎమ్మెల్యే ఆలకు వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట, ఫిబ్రవరి 2 : ఆటో డ్రైవర్లు ఎవరూ అధైర్యపడొద్దని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం కోప్యానాయక్‌తండాకు చెందిన పలువురు హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తాము 15ఏండ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ పిల్లలను చదివిస్తూ జీవనం సాగిస్తున్నామని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో తమకు బతుకు దెరువు లేకుండా పోయిందని, రోజురోజుకూ బతుకులు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రతినెలా చీటీలు, ఆటో కిస్తులు, పిల్లల ఫీజులు తమకు మోయలేని భారంగా మారాయని తమకు బతుకు భరోసా కల్పించేందుకు కృషి చేయాలని ఆటో డ్రైవర్లు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన వారే హైదరాబాద్‌లో ఎక్కువగా ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారని, అందరికీ న్యాయం జరిగేందుకు, మీ సమస్యలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తామని ఎవరూ అధైర్యపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.

## ఊర్కొండకు ఉత్సవ శోభ

- అంజన్న సేవకు వేళాయే..
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- 5న రథోత్సవం.. 10న ముగింపు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

ఊర్కొండ, ఫిబ్రవరి 2 : ఆపదలో ఉన్న వారికి అభయమిచ్చే ప్రదాత.. భక్తుల కోర్కెలు తీర్చే అభయాంజనేయుడిగా ప్రసిద్ధికెక్కిన ఊర్కొంటపేట పబ్బతి ఆంజనేయస్వామి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం ఉత్సవాలు ప్రారంభమై ఈనెల 10వ తేదీ మాఘశుద్ధ పాడ్యమి వరకు అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి మంగళ, శనివారాల్లో ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సత్యచంద్రారెడ్డి తెలిపారు.



ఊర్కొండపేటలోని ఆంజనేయస్వామి ఆలయం

### ఆంజనేయస్వామి ప్రాశస్త్యం..

తెలంగాణ ప్రాంతానికి చెందిన వాస్తు, శిల్ప కళాకారులైన బ్రహ్మరాయులు, భోజరాయులు, సింగరాయులు అనే ముగ్గురు అన్నదమ్ములు పనిలో ఎంతో ప్రాముఖ్యతను సాధించడంతో నిజాం నవాబు వారి ప్రతిభను మెచ్చి ఊర్కొండ పేటకు ఉత్తరాన ముగ్గురు అన్నదమ్ములకు 1500 ఎకరాల భూమిని బహుమతిగా ఇచ్చాడు. వారు ఒక్కొక్కరు 500ఎకరాలు చొప్పున పంచుకొని తమ పేర్ల మీద గ్రామాలను ఏర్పాటు చేసుకున్నట్లు స్థల పురాణం చెబుతున్నది. వాస్తు శాస్త్ర నిపుణుడు అయిన పెద్దవాడు పశ్చిమాన బ్రహ్మరాయపల్లి, మధ్యవాడు భోజరాయపల్లి, చిన్నవాడు తూర్పున సింగరాయపల్లి గ్రామాలను నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. కాలక్రమేణా భోజరాయపల్లి తగులబడిపోగా ఆ ఊరికి ఉత్తరాన గట్టు పక్కన ఇప్పచెట్ల మధ్య భోజరాయులు గట్టుఇప్పలపల్లిని నిర్మించుకోగా పాత ఉరు ప్రాంతం అమ్మపల్లిగా వెలిసింది. నేడు అదికూడా కనుమరుగైపోగా అక్కడ ఇప్పుడు ఒక్క ఆంజనేయస్వామి విగ్రహం మాత్రమే మిగిలి ఉంది. బ్రహ్మరాయపల్లిని నేడు బొమ్మరాజుపల్లిగా పిలుస్తున్నారు. నాటి సింగరాయపల్లిని నేడు వీరన్నపల్లిగా పిలుస్తున్నారు. అయితే గట్టుఇప్పలపల్లి వారు గ్రామంలో పంచలింగాలను ఏర్పాటు చేశారు. భోజరాయులు ఆంజనేయస్వా మి ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఇప్పుడున్న ఊర్కొండపేట గుట్టపై పశ్చిమాన పిల్లిగుండ్ల వద్ద ఒక పెద్ద విగ్రహాన్ని మలిచి ఆ విగ్రహాన్ని ఎడ్లబండిపైన పెట్టుకొని వెళ్తుండగా మార్గమధ్యలో ఆ ఎడ్లబండి ఇరుసు విరిగి పోవడంతో వేరే బండిని తెచ్చి ఆ విగ్రహాన్ని తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినా ఆ బండి కదలలేదు. దీంతో ఆయన ఆ రాత్రి అక్కడే నిద్రించాడు. ఆ రాత్రి భోజరాయుల వారి కలలోకి ఆంజనేయస్వా మి వచ్చి నన్ను ఇక్కడే ప్రతిష్ఠించమని చెప్పడంతో అక్కడే ఆలయాన్ని నిర్మించి ఆ ఆంజనేయస్వామి విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించారు. ఇక అప్పటి నుంచి ప్రతి యేటా పుష్యమాసం మొదలుకొని ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



ఆంజనేయస్వామి మూల విరాట్

### కార్యక్రమాలు

శనివారం ఉదయం 9గంటలకు ఊర్కొండపేటకు చెందిన కీర్తి శేషులు చిరివెల్లి కృష్ణమూర్తిశర్మ గృహం నుంచి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగించి ఆలయానికి తీసుకువస్తారు. అనంతరం 10 గంటలకు ధ్వజారోహణం నిర్వహించి స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి వెండి ఆభరణాలతో సహస్ర నామార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆదివారం(4న) ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు సహస్ర నామార్చన, గజవాహన సేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. సోమవారం (5న)రాత్రి (తెల్లావారితే మంగళవారం) స్వామి వారి పూజలు రథోత్సవం నిర్వహించడంతోపాటు స్వామివారి పంచసూక్తులతో పూజలు నిర్వహిస్తారు. మంగళవారం నుంచి(6నుంచి 10వ తేదీ) స్వామివారి ఉత్సవాల్లో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

## జోరుగా క్రయవిక్రయాలు

- వేరుశనగ@ రూ.7,387

జడ్చర్ల, ఫిబ్రవరి 2 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జోరుగా కొనసాగగా వేరుశనగకు అత్యధికంగా క్వింటా రూ.7,387ధర పలికింది. శుక్రవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ, కందులు, ధాన్యం, మొక్కజొన్న, ఆముదాలు, మినుములు, బెబ్బర్లు, అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 31క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ. 9,979, కనిష్ఠంగా రూ. 9,850, మధ్యస్తంగా రూ. 9,909 ధర పలికింది. అదేవిధం గా 5,294 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.7,387, కనిష్ఠంగా రూ.4,009, మధ్యస్తంగా రూ.7,252 ధర పలికింది. అలాగే ఆముదాలకు క్వింటాకు గరిష్ఠంగా రూ.5,340, బెబ్బర్లు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,001, మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ. 2,372, మినుములు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,001 ధర వచ్చినట్లు అధికారులు తెలిపారు.

